# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 29-01-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ బీటింగ్ రిట్రీట్ వేడుకతో భారత 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా ముగిశాయి.
- ❖ భారత్-యూరోపియన్ యూనియన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం దేశ యువత ఉజ్వల భవిష్యత్‌ను ప్రతిబింబిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.
- ❖ కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ఈరోజు లోకసభలో 2025-26 ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టారు.
- ❖ భారత భవిష్యత్ వృద్ధి రేటు 7 శాతానికి పెరిగిందని ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు డాక్టర్ వి. అనంత నాగేశ్వరన్ చెప్పారు.
- ❖ రాజ్యసభలో కార్యకలాపాలను సజావుగా నిర్వహించడానికి సభ్యులు సహకరించాలని చైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ కోరారు.

==============================

భారత 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల ముగింపును సూచించే `బీటింగ్ రిట్రీట్` కార్యక్రమం న్యూఢిల్లీలోని విజయ్ చౌక్ వద్ద ఈరోజు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులు కూడా హాజరయ్యారు. భారత సైనిక, నావికా, వైమానిక దళం, కేంద్ర సాయుధ దళాల బృందాలు ఈ కార్యక్రమంలో తమ తమ బ్యాండ్ ప్రదర్శనలు చేశాయి. అందులో ముఖ్యంగా సాయుధ దళాల బ్యాండ్‌లు చేసిన వందేమాతరం, భారత్ కే షాన్, ఏ వతన్, సారే జహాన్ సే అచ్చా వంటి దేశభక్తి గీతాల ప్రదర్శనలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. ఆపరేషన్ సిందూర్‌లో సాయుధ దళాల శౌర్యం, త్యాగాలను గౌరవిస్తూ.. భారత వైమానిక దళం బ్యాండ్ ఈ కార్యక్రమంలో ఒక ప్రత్యేక ప్రదర్శన ఇచ్చింది. ఈ ఏడాది విజయ్ చౌక్ వద్ద అతిథుల కోసం ఏర్పాటు చేసిన సీటింగ్ ఎన్ క్లోజర్లకు భారతీయ సంగీత వాయిద్యాల పేర్లను పెట్టారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంటు బడ్జెట్ సమావేశాల ప్రారంభానికి ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు విలేకరులను ఉద్దేశించి ప్రసంగించారు. అంతకుముందు ఉభయసభల సంయుక్త సమావేశంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేసిన ప్రసంగం 140 కోట్ల మంది పౌరుల ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించిందని పేర్కొన్నారు. ఈ ఏడాది అత్యంత సానుకూల వాతావరణంలో ప్రారంభమైందని చెప్పారు. ఆత్మవిశ్వాస భరిత భారత్ నేడు ప్రపంచానికి ఆశాకిరణంగా, ఆకర్షణీయ కూడలిగా ఆవిర్భవిస్తోందన్నారు. ఈ త్రైమాసికం మొదట్లో భారత్-యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) మన యువత ఉజ్వల భవిష్యత్తును ప్రతిబింబిస్తుందని అన్నారు. యువతరంతో పాటు స్వయం సమృద్ధ భారత్‌కు ఈ ఒప్పందం వాణిజ్య స్వేచ్ఛనిస్తుందని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఈరోజు లోక్‌సభలో 2025-26 ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టారు. ఈ ఆర్థిక సర్వే పత్రాన్ని ప్రధాన ఆర్థిక సలహాదారు వి. అనంత నాగేశ్వరన్ మార్గదర్శకత్వంలో ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ఆర్థిక వ్యవహారాల విభాగం రూపొందించింది. ఆర్థిక సర్వే అనేది దేశ ప్రస్తుత ఆర్థిక పరిస్థితితో పాటూ భవిష్యత్ దృక్పథంపై ఒక సమగ్రమైన సమీక్ష. ఈ ఆర్థిక సర్వే ప్రకారం.. 2026 ఆర్థిక సంవత్సరంలో దేశ ఆర్థిక వ్యవస్థ బలమైన వృద్ధి వేగాన్ని కొనసాగించింది. మొదటి ముందస్తు అంచనాల ప్రకారం వాస్తవ జీడీపీ వృద్ధి 7.4 శాతంగా ఉంది. ఈ వృద్ధికి ప్రధానంగా దేశీయ డిమాండ్ దోహదపడిందని ఆర్థిక నివేదిక వెల్లడించింది. ఆర్థిక సర్వే ప్రవేశపెట్టిన అనంతరం సభ ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం తిరిగి సమావేశమయ్యేందుకు గాను ఆ రోజుకు వాయిదా పడింది. ఆదివారం 2026-27 కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. బడ్జెట్ సమావేశాల మొదటి దశ వచ్చే నెల 13వ తేదీ వరకు జరగనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత భవిష్యత్ వృద్ధి రేటు 7 శాతానికి పెరిగిందని ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు డాక్టర్ వి. అనంత నాగేశ్వరన్ పేర్కొన్నారు. ఇది మూడు సంవత్సరాల క్రితం 6.5 శాతంగా ఉండేదని చెప్పారు. 2025-2026 ఆర్థిక సర్వేపై న్యూఢిల్లీలో పాత్రికేయులకు ఆయన ఈరోజు వివరిస్తూ... కోవిడ్‌కు ముందు వాస్తవ జీడీపీ వృద్ధి 6.4 శాతంగా ఉండేదని, 2025 ఆర్థిక సంవత్సరంలో ఇది 6.5 శాతంగా ఉందని.. ఇక 2026లో ఇది 7.4 శాతంగా ఉంటుందని అంచనా వేస్తున్నట్లు నాగేశ్వరన్ తెలిపారు. పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (PLFS) ప్రారంభించినప్పటి నుండి దేశంలో ఉపాధి పరిస్థితులు మెరుగుపడ్డాయని తెలిపారు. ఈ ఏడాది మొదటి తొమ్మిది నెలల్లో 5.4 శాతంగా ఉన్న నిరుద్యోగ రేటు చివరి త్రైమాసికంలో 4.9 శాతానికి స్థిరంగా తగ్గిందని చెప్పారు. భారతదేశ జీడీపీ వృద్ధి అంచనా వేగంగా పెరుగుతోందని అనంత నాగేశ్వరన్ వివరిస్తూ..

(వాయిస్ 31 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంట్ ఎగువసభలో కార్యకలాపాలను సజావుగా నిర్వహించడానికి పార్లమెంటరీ గౌరవాన్ని కొనసాగించడానికి సభ్యులు సహకరించాలని రాజ్యసభ ఛైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ కోరారు. ఈరోజు రాజ్యసభ సెషన్ ప్రారంభంలో జీరో అవర్ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశ ప్రజాస్వామ్యం విభిన్న అభిప్రాయాలు, ఉత్సాహభరితమైన

చర్చల ద్వారానే వర్ధిల్లుతుందన్నారు. గౌరవప్రదమైన అభిప్రాయాల మార్పిడితో సభ హుందాగా జరగాలని సి.పి. రాధాకృష్ణన్ మాట్లాడుతూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉన్నత విద్యా సంస్థలలో సమానత్వాన్ని ప్రోత్సహించడం కోసం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ రూపొందించిన (Promotion of Equity in Higher Education Institutions) 2026 నిబంధనలను నిలిపివేయాలని సుప్రీంకోర్టు ఈరోజు ఆదేశించింది. జనరల్ కేటగిరీ పట్ల వివక్షత చూపే నిబంధనల గురించి న్యాయస్థానం కొన్ని అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ప్రముఖ న్యాయ నిపుణులతో కూడిన కమిటీ ఈ నిబంధనలను పునఃపరిశీలించాలని సూచించింది. నిబంధనలు ప్రాథమికంగా అస్పష్టంగా ఉన్నాయని.. వీటిని దుర్వినియోగం చేసే అవకాశం ఉందని పేర్కొంది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం 2026 నిబంధనల రాజ్యాంగబద్ధతను సవాలు చేసే మూడు రిట్ పిటిషన్లపై విచారణ చేపట్టింది. 2012 UGC నిబంధనలు ప్రస్తుతం అమలులో ఉంటాయని కోర్టు ఆదేశించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పీఎం ఆవాస్ యోజన (అర్బన్) పథకం ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటివరకు కోటీ 64 లక్షలకు పైగా ఇళ్లను మంజూరు చేసినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. లోక్‌సభలో ఈరోజు ప్రశ్నోత్తరాల సమయంలో కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి తోఖన్ సాహు మాట్లాడుతూ... మొత్తం మంజూరైన ఇళ్లలో 98 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్దిదారులకు అప్పగించినట్లు చెప్పారు. ఈ పథకం ద్వారా కోటి మందికి పైగా ప్రయోజనాలు పొందారని వెల్లడించారు. సబ్ కా సాథ్.. సబ్ కా వికాస్.. అనే దార్శనికతతో ప్రభుత్వం పని చేస్తోందని, ఈ మంత్రంతో మైనారిటీ వర్గాలకు చెందిన ప్రజలకు 22 లక్షల ఇళ్లు, షెడ్యూల్డ్ తెగలు, షెడ్యూల్డ్ కులాల వారికి 24 లక్షల ఇళ్లు, ఓబీసీ వర్గాలకు 42 లక్షల ఇళ్లు మంజురు చేసినట్లు ఆయన వివరించారు. మహిళలకు 90 లక్షల ఇళ్లు మంజూరు చేసినట్లు మంత్రి తోఖన్ సాహు చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు స్వల్ప లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 82 వేల 344 పాయింట్ల వద్ద నష్టంతో ప్రారంభమై... చివరికి 222 పాయింట్ల లాభంతో 82 వేల 566 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 76 పాయింట్లు లాభపడి 25 వేల 418 వద్ద ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 91 రూపాయల 95 పైసలుగా ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =